క్లుప్తంగా

ముక్కుపుడక వితరణ

వాల్మీకిపురం : వాల్మీకిపురం గ్రామ దేవత నల్ల వీర గంగాభవాని అమ్మవారి ఆలయంలో శనివారం బెంగళూరుకు చెందిన కిషోర్, నాగస్నేహ దంపతులు అమ్మవారికి ముక్కుపుడకను అందజేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ధర్మకర్త రమణా రెడ్డి, సభ్యులు బలరాం, ఆనంద శెట్టి, పూజారి జనార్ధన తదితరులు పాల్గొన్నారు.

5న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ : మదనపల్లె నుంచి తిరువణ్ణామలైకు 5న ప్రత్యేక అల్ట్రా డీలక్స్ సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో–2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. డిపో నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు మదనపల్లెకు చేరుతుందన్నారు. రానుపోను చార్జీ రూ. 805 చెల్లించాలన్నారు. నాలుగు టిక్కెట్లు కంటే ఎక్కువ ఉంటే ఇంటి వద్దకు వచ్చి టిక్కెట్లు ఇస్తామన్నారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ బైపీసీ(ఇంగ్లీష్ మీడియం) మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుమతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన బాలికలు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బార్‌అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగమల్‌రెడ్డి



తంబళ్లపల్లె : స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బత్తిని నాగమల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోర్టు ఆవరణంలో శుక్రవారం సాయంత్రం సీనియర్ న్యాయవాది హసన్‌వల్లి ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా బి.నాగమల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పి.వెంకటరమణ, జనరల్ సెక్రటరీ డి.శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీగా శంకర్‌నాయక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాగమల్‌రెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల అందరి సహకారంతో న్యాయవాదుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

నేడు రథోత్సవం

వాల్మీకిపురం : జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన వాల్మీకిక్షేత్ర సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 9:15గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుంది. టీటీడీ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఈ మేరకు రాత్రింబవలు టీటీడీ కార్మికులు రథాన్ని శుద్ధి చేసి, రంగులు వేసి రకరకాల పుష్పాలతో అలంకరణ చేశారు. భక్తులు రథాన్ని లాగేందుకు పెద్ద పెద్ద తాళ్లను ఏర్పాటు చేశారు. రథోత్సవంలో పాల్గొనేందుకు ఇప్పటికే వేలాదిమంది భక్తులు వాల్మీకిపురం చేరుకున్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలికిరి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మదనపల్లి డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ సచివాలయాల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడటంలో సచివాలయ సిబ్బందిదే కీలక పాత్ర అన్నారు. సమస్యలతో సచివాలయకు వచ్చే ప్రజలకు సిబ్బందిపై సదుద్దేశం కలిగేలా మసలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగయ్య, ఈఓపీఆర్డీ ఆజాద్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కేవీపల్లె : మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ఉచిత సీట్లు పొందడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఈవో రెడ్డిబాషా ఓ ప్రకటనలో కోరారు. మండలంలో ఒక ప్రైవేట్ పాఠశాల ఉందని, 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించనున్నట్లు తెలిపారు. వికలాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనారిటీ, ఓసీలకు 6 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హతగలవారు ఈ నెల 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు హెల్ప్‌డెస్క్ నెంబరు 9490932556ను సంప్రదించాలన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

పీలేరు : పీజీ వైద్యులు పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఎ. చంద్రశేఖరన్ అన్నారు. రెసిడెన్షియల్ ప్రోగ్రాం కోసం పీలేరు ప్రభుత్వాస్పత్రిలో పదిహేను రోజులుగా విధులు నిర్వహిస్తున్న పీజీ విద్యార్థుల పనితీరును శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆరోగ్య స్థితిగతులు, ఆసుపత్రుల నిర్వహణ, మందుల పంపిణీ వంటి వాటిపై అవగాహన ఏర్పరచడానికి నేషనల్ మెడికల్ కమిషన్ మూడు నెలల రెసిడెన్షియల్ ప్రోగ్రాంను రూపొందించిందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్, ఎస్వీ మెడికల్ కళాశాల డీఆర్‌పీ డాక్టర్ సునీత, పీఆర్‌వో వీరకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో సంక్షేమానికి పెద్దపీట



గట్టులో ప్రతాప్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసి సమస్యపై విన్నవిస్తున్న బీటీ కళాశాల సిబ్బంది

- తంబళ్లపల్లె సమస్యలకు శాశ్వత పరిష్కారం
- కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి

బి.కొత్తకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డితో కలిసి ఆయన బి.కొత్తకోట మండలంలో పర్యటించారు. కాండ్లమడుగు, మొగసాలమర్రి, ఆంజనేయపురం, గుట్టపాళ్యం, పత్రవారిపల్లె, గట్టుల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను కలిసి వారితో మాట్లాడారు. ప్రభుత్వం పేదలు, ధనికుల మధ్య నెలకొన్న ఆర్థిక అసమానతలను తొలగించి అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్న ఆశయంతోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో గత 75 ఏళ్లలో జరగని అభివృద్ధిని మూడున్నరేళ్లలోనే చేసి చూపించామన్నారు. గత ఎన్నికల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్న మాటకు ప్రజలు ఆదరించారని గుర్తు చేశారు. తమను ఆదరించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. సుమారు రూ.600 కోట్లతో ప్రతిపల్లెకు తారురోడ్లు నిర్మించామని, రాష్ట్రంలో అత్యధిక రోడ్ల నిర్మాణాలు చేపట్టింది తంబళ్లపల్లెలోనే అని అన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా సుమారు రూ.600 కోట్లతో ఇంటింటికి తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేసే పనులకు టెండర్లు పూర్తయినట్టు చెప్పారు. ఈ పనులతో వచ్చే 30 ఏళ్లలో ప్రజలకు తాగునీటి సమస్య ఉండదని అన్నారు. శాశ్వతంగా సాగునీటిని అందించి కరువును సమూలంగా పారద్రోలే విధంగా హంద్రీనీవా–గాలేరు నగరి ప్రాజెక్టుల అనుసంధానం పనులు సాగుతున్నాయని అన్నారు. ఈ పనులు పూర్తవగానే వైఎస్సార్‌జిల్లా గండికోట ప్రాజెక్టు నుంచి జిల్లాలోకి 1800 క్యూసెక్కుల నీటిని తరలించడం జరుగుతుందని చెప్పారు. ఈ నీటిని సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా హంద్రీనీవా ప్రాజెక్టు పుంగనూరు ఉప కాలువను విస్తరణ చేయడం కోసం రూ.1,912 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిందన్నారు. త్వరలో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేందుకు వీలుగా సర్వే చేపట్టనున్నారని అన్నారు. మల్లయ్యకొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందాయని, దీనిపై టూరిజం అధికారులు పరిశీలన, అధ్యయనం పూర్తయ్యిందని చెప్పారు. భక్తుల కోసం అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గట్టులో ఇటీవల మృతి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్ సుబ్బిరెడ్డిగారి ప్రతాప్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన తమ్ముడు, మాజీ విండో చైర్మన్ సురేష్‌రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రజల ఆశీస్సులే పార్టీకి శ్రీరామ రక్ష

కురబలకోట : నాయకులు, కార్యకర్తలకు ఎవ్వరికైనా పార్టీతోనే భవిష్యత్తు ముడిపడి ఉంటుందని పార్టీ కోసం అందరూ కృషి చేయాలని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. కురబలకోట మండలం అంగళ్లులో శనివారం ఉదయం ఆయన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డితో కలసి పర్యటించారు. అంగళ్లులోని నాయకులు రెడ్డికుమారి, ఏరాసి సతీష్ కుమార్‌రెడ్డి ఇళ్లను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజల ఆశీస్సులే పార్టీకి శ్రీరామ రక్ష అన్నారు. గుర్తింపు, గౌరవం రాజకీయ పదవుల ద్వారానే లభిస్తుందన్నారు. ఇవన్నీ పార్టీ వల్లనే సాకారం అవుతాయన్నారు. రాష్ట్రం మరింతగా బాగుపడాలన్నా భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలన్నా సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

రెండు మసీదులకు రూ. 12 లక్షలు మంజూరు : మండలంలోని అంగళ్లు మసీదు కబరస్తాన్ ప్రహరీ నిర్మాణానికి రూ. 10 లక్షలు, మొలకవారిపల్లె కబరస్తాన్ ప్రహరీకి రూ. 2 లక్షలు తన నిధుల నుంచి మంజూరు చేస్తున్నట్లు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రకటించారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి వినతుల వెల్లువ

మదనపల్లె : మదనపల్లెలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పర్యటన విజయవంతమైంది. ఈసందర్భంగా పలువురు ఎంపీని కలిసి సమస్యలను పరిష్కరించాలని వినతులు సమర్పించారు. శనివారం ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరి సర్కిల్‌కు పెద్దసంఖ్యలో బైక్‌లు, కార్లతో ర్యాలీగా వెళ్లి స్వాగతం పలికారు. అనంతరం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బహిరంగసభలో పాల్గొని ఆసారా చెక్కును పంపిణీ చేశారు. అనంతరం సభావేదిక ప్రాంగణంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామ,వార్డు సచివాలయాల్లో రెండోవిడతలో నియమించిన సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరుతూ గుడి నాగరాజ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. బీటీ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి కళాశాలలో పనిచేస్తున్న 18 అధ్యాపక, 14 అధ్యాపకేతర సిబ్బందికి జీతాలు అందలేదని, ఉద్యోగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమకు వేతనాలు వచ్చేలా చూడాలని కోరారు. అలాగే ఏప్రిల్ 9న మదనపల్లె మున్సిపల్ టౌన్‌హాల్‌లో గిరిజన సంక్షేమ సేవా సమితి వ్యవస్థాపకులు బుక్యా హరికృష్ణనాయక్ రాథోడ్ ఆధ్వర్యంలో జరుగనున్న గిరిజనుల ఆత్మీయ అవగాహన సదస్సు పోస్టర్లను ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆవిష్కరించారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మదనపల్లె సిటీ : పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మదనపల్లె డివిజన్ పరిధిలో 66 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో ఏ కేటగిరి 19, బీ కేటగిరి 25, సి కేటగిరి 11 కేంద్రాలున్నాయి. శనివారం పరీక్షా కేంద్రాల్లో బెంచీలపై నంబర్లు, గదుల కేటాయింపు కార్యక్రమాలు పూర్తి చేశారు. విద్యార్థులు సులభంగా గదులు తెలుసుకునేలా చర్యలు చేపట్టారు. ఆయా పాఠశాలల ప్రధాన ద్వారం ఎదుట నోటీసు బోర్డులో విద్యార్థుల హాల్‌టిక్కెట్టు నంబర్లు, గదుల నంబర్లు ఏర్పాటు చేశారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీవైఈఓ క్రిష్టప్ప, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

పీలేరులో..

పీలేరు రూరల్ : ఈ నెల 3 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో బలాజీనాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ మెయిన్, అయ్యప్పరెడ్డి కాలనీ జెడ్పీ బాలికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1510 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం



పీలేరు : పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ తదితరులు

కేవీపల్లె : పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ రెడ్డిబాషా తెలిపారు. శనివారం కేవీపల్లెలో ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు మండలంలో 501 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలో కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో చీఫ్ సూపరింటెండెంట్లు రామ్మూర్తి, సురేంద్ర, రెడ్డెప్ప, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు గోవర్ధన్, వెంకటరమణ, రమేష్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మెగాచెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల.రామచంద్రారెడ్డి

కలకడ : రాష్ట్రంలోని మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని మ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కె.బాటవారిపల్లె జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రలో ఆడపడుచులకు ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు విడతల్లో రుణమాఫీని జమచేస్తానన్నారు. ఇచ్చిన మాటప్రకారం మూడో విడత అందించి, వచ్చే ఎన్నికల లోపు నాలుగు విడత పూర్తి చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని 689 సంఘాలలోని సభ్యులకు రూ.6,20,41,753 మెగా చెక్కును మండల మహిళా సంఘం లీడర్లుకు అందజేశారు.

సమస్యల పరిష్కారం కోసమే..

ప్రజా సమస్యను పరిష్కరించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు ప్రతి గడపను తొక్కుతున్నట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ గరడప్పగారిపల్లె, పెరిమినేనివాండ్లపల్లె, రంఘునాథపురం, పోతువారిపల్లె, బీసీ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, కలికిరి మార్కెట్ కమిటీ చెర్మన్ రవికుమార్‌రెడ్డి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, సచివాలయల కన్వీనర్ మోహన్‌రాజ, ఇనాయతుల్లా, షావత్‌అల్లీఖాన్, సర్పంచ్ రామచంద్ర, ఎంపీటీసీ సభ్యులు క్రిష్టారెడ్డి, ముబారక్, సురేష్‌నాయక్, జయప్రకాష్, ఆదిత్యారాం, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో తెగుళ్ల నివారణ



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

వాల్మీకిపురం : ప్రకృతి వ్యవసాయంలో ప్రధాన పంటల మధ్య అంతర పంటలు వేయడం వలన తెగుళ్ల నివారణ సులభమని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాసులు, పెద్ద రెడ్డెయ్య అన్నారు. శనివారం మండలంలోని మంచూరు గ్రామంలో 0.30 సెంట్లు విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయంలో ఏ గ్రేడ్ మోడల్‌ను చిన్నమండెం, సంబేపల్లి మండలాల్లో పని చేస్తున్న 30 మంది ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఏ గ్రేడ్ పొలంలో మిత్ర పురుగులు ఎక్కువ ఉన్నాయని, శత్రు పురుగులు తక్కువ ఉన్నాయన్నారు. ప్రధాన పంట అరటిలో 30 రకాల విత్తనాలు అంతర పంటలు వేశారన్నారు. కార్యక్రమంలో రైతు నారాయణ రెడ్డి, సిబ్బంది రెడ్డిబాష, అనురాధ, రేణుక, రాజేశ్వరి, వెంకట్రమణ నాయక్, సుజాత, వంశి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకోదండరాముడి రథోత్సవం



రామసముద్రం మండలంలో స్వామివారి ఊరేగింపు

రామసముద్రం: మండలంలో శ్రీరామనవమి వేడుకలు పురస్కరించుకుని జంగాలపల్లి, ఎర్రబోయినపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి శ్రీకోదండరామ స్వామి రథోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ఉత్సవ మూర్తులను బ్యాండువాయిద్యాలు, చెక్కభజనలు, కోలాటాలు, కీలు గుర్రాలు, బళ్లారి డ్రమ్ముల నడుమ ఘనంగా ఊరేగించారు. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

మదనపల్లె సిటీ : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శ్రీరామాలయంలో శనివారం స్థానిక సొసైటీకాలనీలోని రథోత్సవం వైభవం జరిగింది. స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు రామనామస్మరణలతో రథంను సొసైటీకాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, బెంగళూరు ప్రాంతాల్లో ఊరేగించారు. భక్తులు స్వామికి టెంకాయలు కొట్టి కర్పూరహారతులు సమర్పించారు. ఉదయం స్వామికి అర్చకులు నరసింహచారి పట్టాభిషేకం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణారావు, చంద్రశేఖర్‌రెడ్డి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కలికిరి : మండలంలోని గుట్టపాళెం గ్రామం కే.బర్నేపల్లిలో శనివారం సీతారాముల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రామాలయం ఆవరణలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం గ్రామంలో స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

ములకలచెరువు: మండలంలోని బురకాయలకోట, వేపూరికోట పంచాయతీ ఆవులవారిపల్లెలో వెలసిన రామాలయాల్లో శనివారం సీతారాముల కల్యాణోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. అనంతరం సీతారాములను ఊరేగించారు.

అంగన్‌వాడీల్లో మెనూ పాటించాలి

డీపీఓ ధనలక్ష్మి



అమిలేపల్లెలో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

గుర్రంకొండ : అంగన్‌వా డీకేంద్రాల్లో తప్పనిసరిగా మెనూ పాటించాలని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని అమిలేపల్లెలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ఆమె స్థానిక డంపింగ్ యార్డు, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు, హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో ప్రభుత్వం మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజు పౌష్టికాహారం అందివ్వాలన్నారు. కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యంపై కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో వైరస్‌లో ఎక్కువగా ప్రబలే అవకాశమున్నందును ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, కార్యదర్శులు మణికుమార్, ప్రమీలా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బిందుసేద్యంతో అధిక దిగుబడి సాధ్యం

కలికిరి : బిందు సేద్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే సమన్వయకర్త డా. జీఎస్ పాండు రంగ అన్నారు. స్థానిక కేవీకే కార్యాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సూక్ష్మనీటి పారుదల పద్ధతులు, ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టమాటా, అరటి, బొప్పాయి, దానిమ్మ, మిరప తదితర అన్ని పంటలకు డ్రిప్ పద్ధతిలో అధిక దిగుబడులు సాధించడంతో పాటు నీటి ఆదా కూడా సాధ్యమతుందన్నారు. కార్యక్రమంలో డ్వామా కలికిరి క్లస్టర్ ఏపీడీ మాధుబాబు, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త కె.మధుసూదన్ రెడ్డి, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి

లేబర్ ఆఫీసర్ కె.ఆర్. ఆనందబాబు

పీలేరు రూరల్ : ఈ నెల 3 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షల సమయంలో పరీక్ష కేంద్రానికి వంద మీటర్ల లోపు ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని లేబర్ ఆఫీసర్ కె.ఆర్. ఆనందబాబు తెలిపారు. శనివారం పీలేరు, కేవీపల్లె పరీక్షా కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

మదనపల్లె సిటీ: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చునని ఆర్టీసీ –1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం డిపో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని అన్ని బస్సులు సమయపాలన ప్రకారం నడపాలని ఆదేశించారు. రీజియన్ స్థాయిలో డిపో మార్చి నెలలో రెండవ స్థానం వచ్చినట్లు తెలిపారు. ప్రయాణికుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవం



పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాల్మీకిపురం : జాతీయ పతాక 103వ ఆవిర్భావ దినోత్సవాన్ని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరిగొండ రోడ్డులోని ఉర్దూ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, విద్యార్థులు జెండాలు చేతపట్టి ఆయనకు నివాళులర్పించారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ 1921లో విజయవాడ వచ్చిన గాంధీ జాతీయ జెండా ఆవశ్యకత గురించి పలువురితో చర్చించారని, గాంధీ సూచన మేరకు పింగళి వెంకయ్య ఒక జెండాను రూపొందించగా అది స్వరాజ్య జెండాగా పేరు పొందిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంజుల, ఉపాధ్యాయులు సురేఖ, వెంకటమ్మ, అరుణ, రమీజా, గీతాంజలి, కోకిల, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

గుర్రంకొండ : మండలంలోని సంగసముద్రం పంచాయతీలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పర్యటిస్తారని ఎంపీడీఓ వెంకటేశులు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్యఅతిథులుగా విచ్చేస్తారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 13 మంది ఎంపిక

మదనపల్లె సిటీ : స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం బెంగళూరుకు చెందిన ట్యాప్ అకాడమీ వారు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హెచ్‌ఆర్ సుఫియన్‌ఖాన్, షాహిద్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించి 13 మందిని ఎంపిక చేశారు. వీరికి ఏడాదికి రూ.నాలుగు లక్షలు ప్యాకేజీ ఇస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులను కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల డాక్టర్ సతీష్, అధ్యాపకులు అభినందించారు.

లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం టీటీడీ ఆధ్వర్యంలో విశిష్టమైన పూజలు నిర్వహించారు. త్వరలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండడంతో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

అంగళ్లు దళితవాడలో టీటీడీ రామాలయం

కురబలకోట : కురబలకోట మండలం అంగళ్లు గ్రామం పెద్ద దళితవాడలో నూతన కోదండ రామాలయ నిర్మాణానికి టీటీడీ రూ. 10 లక్షలు మంజూరు చేసింది. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించినట్లు ఆఫౌండేషన్ సింహపురి, అన్నమయ్య జిల్లాల సహ కన్వీనర్లు రెడ్డెప్పరావు, పూజారి వేణు శనివారం తెలిపారు. 90 రోజుల్లో ఈ ఆలయ నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలకు టీటీడీ ప్రాధాన్యతనిచ్చి ఈ ఆలయానికి నిధులు విడుదల చేసిందన్నారు. అంగళ్లు గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, అంగళ్లు మల్లయ్యకొండ ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై అడ్వంచర్ ఫెస్టివల్

బి.కొత్తకోట : మండలంలోని హార్సిలీహిల్స్‌పై ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో శనివారం స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు అడ్వంచర్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హజరైన మదనపల్లె జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కృష్ణప్ప మాట్లాడుతూ విద్యార్థుల్లో ధైర్య సహసాలు పెంపొందించడమే లక్ష్యంగా స్కౌట్ కబ్ మాస్టర్లు పనిచేయాలని కోరారు. భూకంపాలు, అగ్నిప్రమాదాలు, తుఫానులు సంభవించినప్పుడు ఎలా వ్యవహరించాలని అన్నదానిపై శిక్షణ ఇవ్వాలని కోరారు. అనంతరం గోల్డెన్ యారో అవార్డులు పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. స్కౌట్ విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలను తిలకించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి నరసింహారెడ్డి, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, జిల్లా శిక్షణ మిషనర్ భాస్కర్‌రెడ్డి, మాస్టర్లు పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ పరిధిలోని తంబళ్లపల్లె మండలంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేకులకుంట తాండా సమీపంలో 300 లీటర్లు సారా ఊట ధ్వంసం చేసి నిర్వాహకుడు యం.గోపాల్‌నాయక్‌పై కేసు నమోదు చేశామన్నారు. అతడిని రిమాండ్ తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

ములకలచెరువు : ములకలచెరువు పీహెచ్‌సీని జిల్లా డీఐఓ ఉషారాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆస్పత్రిలో సౌకర్యాలు, సిబ్బంది పనితీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిరోధక టీకాల నిల్వను పరిశీలించారు. అనంతరం పెద్దపాళ్యం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషక సరుకులపై ఆరా తీశారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

నిమ్మనపల్లె : ఆరోగ్యకర జీవితంలో చిరుధాన్యాలు కీలకపాత్ర పోషిస్తాయని ఎంపీడీఓ లీలామాధవి అన్నారు. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలో జాతీయ గ్రామీణ జీవనోపాధుల సంస్థ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) ఆధ్వర్యంలో నిమ్మనపల్లె రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీఓ) నిర్వహించిన మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్‌లో ఎంపీడీఓ పాల్గొన్నారు. చిరుధాన్యాలతో చేసిన వివిధ ఆహార పదార్థాలు, వంటలు, ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. చిరుధాన్యాలను రోజువారి ఆహారంలో తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు సకాలంలో అంది అనారోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చన్నారు.